కథా నిలయం
55503
శ్రీకాకుళం



# యెరేంజ్‌డ్ మేరేజ్

సత్యవతి పెళ్లికి తల్లి జగదాంబే తొందరపడింది. తండ్రి రఘురామయ్య నిమ్మకి నీరెత్తినట్టుండిపోయాడు. ఆరోగ్యంగా వుండి పెరుగుతూ, బుద్ధిగా చదువుకుంటూ, యింటి పనులలో సాయపడుతూ గ్రాడ్యుయేట్ అయిన కూతురు వల్ల తండ్రికే యిబ్బందులూ రాలేదు. ఫస్ట్ క్లాసొచ్చింది. మాస్టర్ డిగ్రీ తెచ్చుకుంటానంటుంది సత్యవతి. కూతురి కోరిక తండ్రికిబ్బంది కలిగించలేదు.

గుమ్మటమల్లే వుండి, బంగారు రంగు వచ్చి, వళ్లంతా మొగ్గ తొడిగి, విరియబూసిన పూల చెట్టులాగా ఆకర్షిస్తున్న కూతుర్ని చూసి తల్లి, ''దీన్ని ఒకయ్య చేతిలో పెట్టకపోతే ప్రమాదించదూ?'' అనుకున్నది.

''చదువుచాల్లే సత్యా. ఉద్యోగం గూడా వెలిగిస్తానంటావేమో! అదేం కుదరదు. లేనివాళ్లమా, కానివాళ్లమా?'' అన్నది తల్లి.

''నా క్లాస్‌మేట్స్ మనవాళ్లే. వాళ్లకు లేని తప్పు నాకెలా వర్తిస్తుందీ? వాళ్లూ కలవారిబిడ్డలే. అయినామె కూతుళ్లే'' అన్నది కూతురు. తల్లి జగదాంబ కూతుర్ని కొట్టబోయింది. కూతురు నవ్వుతూ పారిపోయింది. తల్లి ఆస్తీ, బంగారం తనకే చెందుతాయి. తమ్ముళ్లకి చెందవు. ఆ ఆస్తీ బంగారం అడ్డుపడుతున్నాయని గ్రాడ్యుయేట్ సత్యవతికి తెలియదు. ఆస్తే అవరోధం.

సముద్రుని పట్టి పేరు పేరిందేవి. శనివారం వనభోజనం చేసి, పూలు కోసుకొస్తామని మారాం చేసింది పేరిందేవి. ఏడుగురు నదీమ తల్లులూ ఆశ్చర్యపోయి ''మా బిడ్డవై పుట్టి జాణతనము లెల్లమాని పూలు కొయ్యబోదువా పువ్వుబోణీ'' అని నోటిమీద చేయ్యేసుకున్నారు. సత్యవతి తండ్రికాళ్లు వాటేసుకుని మారాం చేసింది. ''నాన్నా! నాకు స్కాలర్‌షిప్ వస్తుందన్నది సుపీరియర్ మదర్. నాకు గ్రూపులో, ప్రాక్టికల్సులో నైన్‌టీ వచ్చాయట. ఎగ్జామినరూ రికార్డు మీద సంతకం చేసే ఆయన గూడా అన్నారుట''.

తండ్రి కళ్లు తడి అయ్యాయి.

తల్లి సంబంధాలు చూడమని పురమాయించింది. ఆమె అత్తారూ పుట్టింటారు గూడా యెన్నుతున్నారు. యెన్నిక అయే లోపల సత్యవతికి లౌలెటరొచ్చింది. అబ్బాయి తల్లి వేపే. చిన్నాన్న కొడుకు. తమ్ముడౌతాడు.

'సత్యా! నాకు డ్యాక్టరేట్ వచ్చింది. ఉద్యోగం యూనివర్శిటీలో యిప్పిస్తే చాలు. మీనాన్నకాపాటిపరపతి వున్నది. మా అమ్మ నిన్ను కాలు కిందపెట్టనీయదు. నేను నీకు సంక్రమించే ఆస్తి మీద గానీ, బంగారం మీద గానీ కన్నేయను. మాటంటే మాటే. పెళ్లిలో ప్రమాణం చేస్తాను. ఇదే నా ప్రపోజిషన్ అనుకో. ఇట్లు ఆనందరావు''.

ఆ వుత్తరం తండ్రికి చూపింది సత్యవతి. తన పెద్ద చదువుకి యేది అవరోధమో తెలిసింది సత్యవతికి. ఆశచావక తల్లికీ చూపిందా లౌలెటర్ సత్యవతి. అంతటితో వూరుకోక ''అమ్మా నాకు చెందేవి నా తమ్ముళ్లకియ్యి. నేను మామయ్య ఆనందాన్ని చేసుకుంటా'' అన్నది.

''కోడళ్లకెందుకు చెందాలీ! నా ఆస్తీ బంగారం నా కూతురికే చెందాలి. ఆనందానికి సెంటు భూమి లేదు. రెక్కలే ఆధారం. నా పింతండ్రి భార్యకి మంచి పేరు లేదు. మొగుడిని వదిలేసింది'' అని అబ్జెక్షన్ చెప్పింది జగదాంబ.

సత్యవతి నిట్టూర్చింది.

## 2

యెన్నిక చేసి సంబంధం తెచ్చారు. జగదాంబకి నచ్చింది. పెళ్లిచూపుల వేడుకా ముగిసింది. అల్లుడు చిన్నవాడే అందగాడే. తల్లి తదనంతరమే సత్యవతికి తల్లివన్నీ చెందుతాయి. తండ్రి కూతురు వంటిమీద యిరవై తులాల బంగారముంచుతాడు పెళ్లిలో. మర్యాదలూ చెల్లిస్తాడు.

సత్యవతి పెళ్లి అయింది. మొదటి యాడాదే కొడుకు నెత్తుకుని, అరేంజ్డ్ మేరేజ్ అసలు రంగు చూసింది.

తొలిచూలుకి తొంబై పెట్టి వేడుక చేస్తే మలి చూలుకి మొహాన బొట్టైనా

పెట్టేవారు లేరని సామెత.

పెళ్లయి మూడవయేడు గడుస్తుండగా సత్యవతి కూతుర్నెత్తుకున్నది. పురిటికని పుట్టింటి కొచ్చిన ఆడపడుచు పుట్టింట్లోనే వుండిపోయింది. కథలల్లి అత్తవారితో ఘర్షణ పడ్డానని చెప్పింది తారామతి. మగడు వేరే స్త్రీలను తన పడగ్గదిలోకి తోడ్కొని పోతూ తనను నిరాదరించాడట. నగలు వడేసి లాక్కున్నారట. కాని తారామతి మొగుడు భార్యకోసం వచ్చినట్టు వచ్చి తనిష్టమొచ్చినన్ని నాళ్లుండి వెళతాడు.

సత్యవతికింకా యింటిగుట్టు తెలిసి గుబులూ, భయమూ రోతా పుట్టాయి. గుట్టుగా తాగుతున్నారు. ముద్దుగా పిల్లలకూ పోస్తున్నారు. ఆడమగా అని లేదు. కోర్టుకెక్కారు. లాయర్లు గుంజుతున్నారు. భర్త పార్థసారథి ఆ వూళ్లోనే జూనియర్ కాలేజీలో లెక్చరర్. సత్య వంటి మీదవి గిల్టు నగలుగా మారాయి. వంటిల్లు ఆదరించింది. వచ్చేపోయే ఘరానా మనుషులూ. వారికి ఆదరసత్కారాలు. పార్థసారథికి మరో పిల్లను యివ్వజూస్తున్నారనేది రట్టు అయింది.

ఈ బురద నీటికి అడ్డుకట్ట వేయాలని ఆలోచించింది సత్యవతి. ఆడపడుచు కూతురు శల్యావశిష్టమై, వాతలు, కమిలిన చోట్లతో కాన్పుకి వచ్చింది. వారానికే కాన్పు అయింది. ఒంటి మీదేమీ లేవు. ఇది మూడో కాన్పు. మొదటి బిడ్డలూ యిక్కడే వున్నారు. మగడొచ్చిపోతూ సీసాలు కంటబడగా, యెవరూ చూడకుండా ఓ సీసా దొంగిలాడుతాడు. పేకాట ఆడుతాడు డబ్బు పెట్టి అనేది గుట్టుగా వుంచారు. జూదంలో కోల్పోయినప్పుడు బుద్ధిమంతునిలాగా కనబడతాడు. ఆడపడుచు తారామతి, వుద్యోగంలో చేరి నేర్పుగా మగనికి ముక్కుతాడు పోసి లాక్కెళ్లింది.

సత్యవతి జబ్బుపడిందనీ నెలలనీ విని తండ్రి వచ్చి తీసికెళ్లినప్పుడు, దాపరికం లేకుండా అంతా చెప్పింది సత్యవతి. కొత్తగా లేచిన రగడలో తేలిందేమనగా, తల్లి తదనంతరం సత్యవతికి చెందేవి, యిపుడే యిచ్చేయమనీ,

తెచ్చేయమనీ, తేలేకపోతే యింటికి రావద్దనీ అన్నారుట.

జగదాంబకు చీమకుట్టినట్టున్నా లేదు. పోషణ సరిగాలేక విశ్రాంతి లేక, కడుపులో బిడ్డ జబ్బు పడి, పుట్టి, పురుట్లోనే పోయింది. తల్లి దింపి రావాలని చూస్తున్నదని గ్రహించి సత్యవతి యేడుస్తూ చెప్పలేక చెప్పలేక తలవంచుకుని సిగ్గుదాచుకుంటూ చెప్పింది.

''తోడుకోడలికి పక్షవాతం వచ్చి మంచాన బడింది. నిషాలో బావగారు పట్టుకోబోతాడు. తన బెడ్‌రూమ్‌కి వస్తాడు. అత్తగారికి కీళ్లవాతం. మామగారు వ్యవసాయం చూస్తూ అలిసిపోయి సీసాలు పూర్తిచేసి మత్తుగా వుంటాడు. నోరు విప్పడు. అధికారమంతా వదినదే. వంటవాడు మానేశాడు. పనిమనిషి తారామతికి వెరుస్తుంది. చేయలేనమ్మా నన్ను దింపిరాకు. ఇక్కడ బతకనీ. నీకు నాన్నకు ఋణపడివుంటా'' అని యేడిస్తే జగదాంబ ''అదేమన్నమాట? పిల్లలకి వాళ్ల ఆస్తీ భూములు రావద్దా? ఇక్కడుంటే వస్తాయా? నెగ్గుకు రావాలి. చదివావు. గ్రాడ్యుయేటు అయి యేమి లాభం? చదువు చట్టులేని నేనే నయం!''.

''అమ్మా భ్రమలో వున్నావు. పోబడెక్కువ రాబడి తక్కువ. పశువులనూ అమ్ముతున్నారు. భూములు తాకట్టులో వున్నాయి. ఇల్లు వదిన పేర పెట్టారు'' అని యెన్ని వెల్లడించినా తల్లి మొండి వైఖరి మారలేదు. తండ్రి కాళ్లు తాకి ''నాన్నా! ట్రెయినింగై జాబ్ చేస్తా. నన్ను పిల్లల్నీ నేను సపోర్ట్ చేసుకుంటా. సర్వైవల్ కోసం తెగించి వున్నారు అత్తవారు. నీవు అమ్మపక్షమేనా? నా పిల్లలకు ఆ సైటూ లేదు. తల్లిలేని పిల్లల్ని చూడదలచావా'' అని మొహం వంక చూస్తే తండ్రి కళ్లనించి సంతతధారగా నీళ్లు కారుతున్నాయి.

సత్యవతి ''దేవుడేంటి అరేంజ్ చేశాడో అదే జరుగుతుంది'' అని నిరాశపడి చేతులెత్తేసింది.

ఆ మరునాడే దేవుడు తోలితే వచ్చినట్లు స్వయానా మేనత్త సరస్వతమ్మ రాజమండ్రి నించి వచ్చింది అన్నను చూచిపోదామని. ఆమెకు సంతానం లేదు. ఇళ్లద్దెలు భర్త కలెక్ట్ చేసి తెస్తాడు. ఇద్దరూ వార్ధక్యంలోకి అడుగుంచారు.

బండిలాగుతున్నారు. దేవుడు పిలవాలి. యెవరు ముందో యెవరు వెనకో.

మేనత్త సరస్వతమ్మ వారమున్నది. పోతూపోతూ అన్ననూ వదిన్ను ఒప్పించి మేనగోడల్నీ దాని యిద్దరు పిల్లల్నీ తీసుకుపోయింది. మేనత్త పోషణలో కోలుకున్న సత్యవతి అత్త మొగుడి సాయంతో (ఆయన పేరు సాంబశివ), ట్రెయినింగ్ అయి, కాన్వెంటులో టీచరు పోస్టు తెచ్చుకున్నది. తండ్రి రఘురామయ్య వచ్చి తన చెల్లినీ కూతుర్ని పిల్లలను బావనూ చూసిపోతూ, కూతురుకి పర్స్ అందించి వెళ్తూ కొంత విచారం తగ్గించుకున్నాడు.

మేనత్తా ఆమె భర్తా ప్రోత్సహించగా నైట్‌స్కూల్‌కి అటెండయి వేరే సబ్జక్ట్సుతో యేమ్యే డిగ్రీ కొట్టింది సత్యవతి. ఇపుడు యెమ్మే బియిడి సత్యవతి. టైపు, షార్టుహేండు, కంప్యూటరూ సర్టిఫికెట్లూ తెచ్చుకున్నది సత్యవతి. అత్త సరస్వతి, మామ సాంబశివ టూ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్ కొనిపించి సత్యవతి పేరపెట్టి అందులోకి మారారు. తమ పాత యిళ్లకి మంచి ధర పలికితే అమ్మేశారు. సత్యవతి కొడుకూ కూతురూ ఎలిమెంటరీ స్కూలు వదిలి హైస్కూలులోకి నడిచి రాంకులు తెచ్చుకుంటూ ప్రైజులు కొడుతున్నారు. పేర్లు సురేష్, సుధ. రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఫస్టొచ్చారు. వాళ్ల కోచ్ వాళ్లను బెంగుళూరు తీసికెళ్లి అక్కడా పోటీల్లో పాల్గొనమని తెచ్చి తల్లివద్ద దింపాడు.

జగదాంబకి న్యుమోనియా తాకిపోయింది. తండ్రి రఘురామయ్య సత్యవతికి చెందాల్సినవి అందించి అఫీసియల్ పేపర్స్ యిచ్చాడు. చెల్లినీ కూతుర్నీ బావనూ పిల్లల్ని చూసి వెళ్లాడు.

3

ఓ శుభ ముహూర్తాన సత్యవతి మొగుడూ, ఆడపడుచూ పెద్దలను వెంటబెట్టుకొచ్చారు. గడసరి ఆడబడుచన్నది.

''మూడవసారి పురుటికి వెళ్లిన దానివి రానేలేదేమే మరదలా? పోనీ మా వాళ్ల తెచ్చి దింపిపోలేదు గడుస్తనమంటే అలా వుండాలి. మీ నాన్న వెళ్లక్కర్లేదన్నాడా? మీ అమ్మ మేమే వచ్చి తీసికెళ్లాలన్నదా? అత్తా మామా

దివంగతులైనా ఆచారం పాటిద్దామనిపించలేదే నీకు మరదలా? ఒకళ్లు పిలవాలా? బతిమాలాలా? నీ యింటికి నువ్వొచ్చి మానేజ్ చేసుకోవాలి'' అని దీర్ఘాలు తీసింది.

ఫార్మాలిటీస్ పూర్తి అయాయి. తినటం తాగటం అయింది. పెద్దలు ధర్మపన్నాలు వల్లించారు.

మగడు పార్థసారథి నోరుబడిపోయినట్లు చూస్తున్నాడు. నల్లబడి చిక్కిపోయినాడు. కళ్లూ పళ్లూ బైట పడ్డాయి. అప్పు మోచేత్తో పొడవగా తెప్పరిల్లి నోరు విప్పాడు.

''తీసికెళ్దానికే వచ్చాము''.

సత్యవతి గుడ్లు పెట్టుకు చూసింది.

సరస్వతీ, సాంబశివా నవ్వుతూ అంతలోనే ఆశ్చర్యంగా వాకిలి వంక చూశారు.

డ్రాయింగ్ రూమ్ వాకిలి తీసి వున్నది. వాకిలికడ్డంగా రక్షణశాఖ వారిద్దరు, ఒక న్యాయవాది, రెండు కుక్కలూ, ఓ సామాన్య గృహస్తు నిలబడి కనిపించారు.

తెలుసుకోవాలనే సరస్వతీ, సాంబశివా లేచారు. ''రండి'' అనాలనే వారి అభిప్రాయం. కాని ''రండి'' అనే పదం వాకిట్లో నిలబడి వున్నవారి నోటినించి వచ్చింది. చేయి తలా వూపుతూ పిలుచుకెళ్లారు. రక్షణశాఖ అధికారి చేతిలో అరదండాలు మిలమిల మెరిశాయి. కుక్కలూ మర్యాదగా వెళ్లేవారిననుసరించి వెళ్లాయి. తలుపులు మూసుకున్నాయి.